# సాక్షి నిర్మల్

సోమవారం, 11, సెప్టెంబర్, 2023






**గొర్రెల పంపిణీలో గోల్‌మాల్**

సబ్సిడీ గొర్రెల యూనిట్ల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు అధికారులు, మధ్య దళారులు కలిసి లబ్ధిదారులను నిండా ముంచుతున్నారు. 8లో▸



**ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు..**

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం 31.0/24.0

**వాతావరణం**

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### టెట్ నిర్వహణకు జిల్లాలో 32 పరీక్ష కేంద్రాలు

నిర్మల్ రూరల్: ఈనెల 15న నిర్వహించనున్న టెట్‌కు జిల్లాలో 32 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ డివిజన్‌లో 28, భైంసా డివిజన్‌లో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 12,197 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్ ఫొటోపై ఐడెంటిఫికేషన్ లేకపోతే డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### స్వర్ణ ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత



గేటు ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

సారంగాపూర్: మహారాష్ట్రలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. అప్రమత్తమైన అధికారులు ఆదివారం తెల్లవారుజామున ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు (1.484 టీఎంసీలు) కాగా, వెయ్యి క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. ఒక గేటు ద్వారా అంతే మొత్తం నీటిని స్వర్ణ నదిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని 1,183 అడుగుల వద్ద స్థిరంగా ఉంచామని జేఈ మధుపాల్ తెలిపారు.

### అన్సర్‌పాషాకు అవార్డు



అన్సర్ పాషా

నిర్మల్ రూరల్/సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన షేక్ అన్సర్ పాషా సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. పాషా జిల్లా కేంద్రంలోని ఇంపాల్స్ ప్రైవేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రకటించిన సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డును ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని నెక్స్ట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రదానం చేశారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అన్సర్ పాషాను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### చేపపిల్లల పంపిణీలో అక్రమాలు అరికట్టాలి



పిట్టల రవీందర్‌కు పూలమొక్క ఇస్తున్న సభ్యులు

నిర్మల్ రూరల్: జిల్లాలో చేపపిల్లల పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్య సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ పల్లికొండ శశికళ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్‌ను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన రవీందర్‌కు ప్రమోటర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తే జిల్లా మత్స్యశాఖ అధికారులు, చేపపిల్లలు సరఫరా చేసే కాంట్రాక్టర్లు కుమ్మక్కై అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతిని రూపుమాపేందుకు నేరుగా ఫిషరీస్ సొసైటీల బ్యాంక్ ఖాతాల్లోకే నగదు బదిలీ చేయాలని కోరారు. అనంతరం పిట్టల రవీందర్ మాట్లాడుతూ.. జిల్లా మత్స్య సహకార సంఘం పూర్తిస్థాయిలో మహిళా ప్రతినిధుల నాయకత్వంలోకి రావడం అరుదు అని పేర్కొన్నారు. అక్రమాలపై తప్పకుండా విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

# బీజేపీలో పోటాపోటీ..

- అభ్యర్థిత్వం కోసం జోరుగా దరఖాస్తులు
- చివరిరోజూ అప్లికేషన్లు ఇచ్చిన నేతలు
- ముధోల్ అత్యధికంగా ఆశావహులు
- దరఖాస్తుదారుల్లో ఏబీవీపీ నాయకులు



దరఖాస్తు చేసుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి

నిర్మల్: బీజేపీ టికెట్ కోసం జిల్లా నుంచి పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన ఆశావహులతో పాటు వివిధ అంశాల ఆధారంగా తమకూ టికెట్ ఇవ్వాలంటూ ఇతర నాయకులు అప్లికేషన్స్ ఇచ్చారు. చివరిరోజైన ఆదివారం అధికసంఖ్యలో దరఖాస్తులు అందించారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్‌తో పోలిస్తే ముధోల్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

**గెలుపుపై ఆశలతో..**

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీజేపీ గత ఎన్నికల్లో తన ప్రభావాన్ని చూపింది. ముధోల్‌లో రెండోస్థానంలో నిలిచింది. ఖానాపూర్‌లో కొన్ని రౌండ్లు ఆధిక్యతను చాటి అధికార పార్టీకి చెమటలు పట్టించింది. ఒక్క నిర్మల్‌లో మాత్రమే అభ్యర్థి ఎంపిక ఆలస్యం చేయగా ఓటుబ్యాంక్ దారుణంగా పడిపోయింది. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ జిల్లా నుంచే రావడం గమనార్హం. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కమలం తన ఉనికిని చాటింది. భైంసా మున్సిపల్‌లో బీఆర్ఎస్ ఖాతా కూడా తెరవలేదు. ఎంఐఎం మెజార్టీ దక్కించుకోగా, తర్వాత మిగిలిన స్థానాలన్నీ బీజేపీ గెలిచింది. పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తన ఐదోవిడత ప్రజాసంగ్రామయాత్రను జిల్లానుంచే చేపట్టడంతో బీజేపీకి బాగా కలిసివచ్చింది. గ్రామస్థాయి నుంచి పార్టీకి క్యాడర్ పెరగడంతో పాటు పలువురు సీనియర్ నాయకులు కమలదళంలో చేరారు. వీటన్నింటి నేపథ్యంలో జిల్లాలో గెలువచ్చన్న ఆశాభావాన్ని పార్టీ వ్యక్తంచేస్తోంది. ఇదేక్రమంలో బీజేపీ టికెట్ దక్కితే విజయం సునాయసమని ఆశావహులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

**ముధోల్ నుంచి అధికంగా..**

రాష్ట్రంలోనే దాదాపు అధిక దరఖాస్తులు ముధోల్ నియోజకవర్గం నుంచి వచ్చినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక్కడి నుంచి ప్రధాన ఆశావహులతో పాటు చాలామంది పార్టీ సీనియర్ నాయకులు తమ పేర్లనూ పరిశీలనలో ఉంచాలంటూ పార్టీకి అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఇక్కడ ప్రధాన ఆశావహులుగా భావిస్తున్న జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్‌తో పాటు యువనేత, ఎన్ఆర్ఐ బాజీరావు పటేల్, బద్దం భోజారెడ్డి, గాలి రవి, బాలాజీ సూత్రావే, ఎనుపోతుల మల్లేశ్వర్, నారాయణరెడ్డి, ఓంప్రకాశ్‌లడ్డా, పడ్‌పెల్లి గంగాధర్, రవిపాండే, జాదవ్ అఖిలేశ్, జుట్టు చంద్రశేఖర్, గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన బాసర మాజీ సర్పంచ్ శైలజ, సతీశ్‌రావు దంపతులూ దరఖాస్తులు అందించారు. నియోజకవర్గంలో పార్టీ తప్పకుండా గెలుస్తుందన్న నమ్మకంతోనే వీరంతా అప్లికేషన్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. దరఖాస్తు చేసిన నాయకుల్లో అధికశాతం మంది తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ కోసం పనిచేస్తామనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు.

### నిర్మల్, ఖానాపూర్‌లో అంతంతే..

ముధోల్ నుంచి అధికసంఖ్యలో దరఖాస్తులు రాగా, నిర్మల్, ఖానాపూర్‌లో అంతంత మాత్రంగానే అప్లికేషన్లు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఖానాపూర్ టికెట్ కోసం మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య జానకీబాయి, ఇంద్రవెల్లి జెడ్పీటీసీ సభ్యురాలు ఏ పుష్పలత గతంలో పలుపార్టీల నుంచి పోటీచేసిన అజ్మీరా హరినాయక్ దరఖాస్తు చేసుకున్నారు. నిర్మల్ నుంచి ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఒక్కరే బరిలో ఉన్నప్పటికీ పార్టీ ఇచ్చిన అవకాశం మేరకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. సీనియర్‌నేత డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డితో పాటు ఖానాపూర్ ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో అక్కడి నేత పొద్దుటూరి గోపాల్‌రెడ్డి నిర్మల్‌లో అవకాశం ఇవ్వాలంటూ దరఖాస్తు చేసినట్లు తెలిసింది. అలాగే కుంటాలకు చెందిన జుట్టు చంద్రశేఖర్ బీసీ కోటాలో ముధోల్ లేదా నిర్మల్ నుంచి అవకాశం ఇవ్వాలంటూ రెండుస్థానాలకు దరఖాస్తులు ఇచ్చారు. ఇక ఏబీవీపీలో ఏళ్లపాటు పనిచేసి బీజేపీలో చేరిన పలువురు నాయకులూ దరఖాస్తు చేసుకున్నారు. ముధోల్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి పడ్‌పెల్లి గంగాధర్, నిర్మల్ నుంచి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి అప్లికేషన్లు ఇచ్చారు. వీరు కాకుండా మరికొందరు కూడా జిల్లా నుంచి దరఖాస్తులు అందించినట్లు తెలుస్తోంది. పార్టీ మాత్రం మొత్తం స్క్రూటినీ చేసిన తర్వాతనే దరఖాస్తుదారుల పేర్లు వెల్లడిస్తుందని బీజేపీవర్గాలు చెబుతున్నాయి.

### ఆలయాల ప్రారంభోత్సవం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్: జిల్లా కేంద్రంలోని నాయుడివాడలో రూ.10 లక్షలతో నిర్మించిన గుట్ట వీరన్న ఆలయం, రూ.17 లక్షలతో నిర్మించిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, రూ.21లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్ స్వప్న, నాయకులు అరవింద్, పుల్లయ్యగారి కృష్ణ, కొర్తికంటి లింగన్న తదితరులున్నారు.

### సమగ్ర శిక్ష ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టిన సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆదివారం శిబిరంలో మోకాళ్లపై నిల్చుని అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేదాకా నిరసన కొనసాగిస్తామన్నారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి భోజన్న, ఉపాధ్యక్షులు రత్నం, గజేందర్, రాము, గంగాధర్, సుధాకర్, సాయినాథ్, రాజమణి, కవిత, కౌసల్య, రాణి, చందన పాల్గొన్నారు.

# పాములతో జెర ఫైలం



బైక్‌లో దూరిన పాముపిల్లను పట్టుకుంటున్న సామాజిక కార్యకర్త ఫిరోజ్‌ఖాన్ (ఫైల్)

- జిల్లాలో జనావాసాల్లోకి సర్పాలు
- ఏటా సంభవిస్తున్న మరణాలు
- పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి
- పాము కాటేస్తే కంగారుపడొద్దు
- నాటువైద్యుడి వద్దకు అసలే వద్దు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సరైన వైద్యం



నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో పాముకాటుతో మృత్యువాత పడుతున్నారు. ఇందులో రైతులు, చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. పొలాల్లో పనులు చేస్తూ కొందరు, ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ మరికొందరు, రాత్రిళ్లు ఇంట్లో నిద్రపోతుండగా ఇంకొందరు పాము కాటుతో మృతి చెందిన ఘటనలున్నాయి. పాముకాటు వేసిన సమయంలో బాధితులు కంగారుతో నాటు వైద్యులను ఆశ్రయిస్తుంటారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా మూఢ విశ్వాసాలతో మంత్రాలు చేయించడం, పసరు మందులు వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతమున్న చల్లని వాతావరణానికి పచ్చని చెట్లు, పొదలు తోడు కావడం, వర్షానికి వరదనీటి ప్రవాహం వస్తుండడంతో పాములు ఆరుబయట విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని కాలనీల్లో జనావాసాల మధ్య, నిల్వ నీరున్న కుంటల్లో దర్శనమిస్తున్నాయి. కప్పలు, ఎలుకలను వేటాడే క్రమంలో ఇళ్ల సమీపంలో ఉండే గుంతలు, చెట్లపొదల వద్ద ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో అటుగా వెళ్లి ఆడుకుంటున్న చిన్నపిల్లలు పాముకాటుకు గురవుతున్నారు. అంతే కాకుండా ఇళ్ల ముందు, ఆరుబయట నిలిపి ఉంచుతున్న ద్విచక్ర వాహనాలు, కారు ఇంజిన్లు, బస్సుల్లో ఇలా ఎక్కడపడితే అక్కడ పాములు కనిపిస్తుండడంతో జనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు కూడా తరచూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

**పాము కాటును ఇలా గుర్తించాలి..**

పాము కరిస్తే ముందుగా ఏ ప్రాంతంలో కాటు వేసింది.. నేరుగా శరీరంపై కాటు వేసిందా? లేక దుస్తుల పైనుంచి వేసిందా? అనేది పరిశీలించాలి. శరీరంపై కాటు వేస్తే ఎన్నిగాట్లు పడ్డాయో చూడాలి. త్రాచుపాము, కట్లపాము, రక్తపింజర కాటేస్తే రెండు గాట్లు పడుతాయి. అంతకంటే ఎక్కువ గాట్లు కనిపిస్తే అది సాధారణ పాముగా గుర్తించవచ్చు. విష సర్పం కాటేస్తే సూదితో గుచ్చితే చుక్కగా రక్తం వచ్చినట్లు ఉంటుంది. కరిచిన చోట రెండు రక్తపు చుక్కలు కనిపిస్తాయి.

**ఇవీ.. జాగ్రత్తలు**

పొలం పనులకు వెళ్లే రైతులు, అడవుల్లో పశువుల వెంట తిరిగేవారు పాముకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రిపూట పొలాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టార్చిలైట్ వెంట తీసుకెళ్లాలి. పాములు ఎక్కువగా మోకాలు కింది భాగంలో కాటువేస్తాయి. కాబట్టి కాళ్లను కప్పి ఉండే చెప్పులు ధరించాలి. కాళ్ల కిందకు ఉండే దుస్తులు వేసుకోవాలి. కప్పలు, ఎలుకలు ఎక్కువగా ఉండే చోట పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అది దృష్టిలో పెట్టుకుని పనులు చేసుకోవాలి. ఎవరైనా పాముకాటుకు గురైతే ఆందోళనకు గురికాకుండా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

**ప్రథమ చికిత్స ఇలా..**

పాముకాటు వేసినప్పుడు నోరు లేదా బ్లేడ్‌తో గాటు పెట్టకూడదు. కంగారులో నాటువైద్యులను ఆశ్రయించవద్దు. పాము కాటు వేసిన చోట సబ్బుతో శుభ్రంగా కడగాలి. పాముకాటుకు గురైన వ్యక్తికి ప్రమాదం ఏమీ లేదని చెప్పాలి. కాటు వేసిన భాగంలోని మూడు అంగుళాల పైభాగాన గుడ్డతో కట్టాలి.

### మందులు అందుబాటులో ఉంచాం



అన్ని ప్రభుత్వ దవాఖానలు, పీహెచ్‌సీల్లో పాముకాటుకు సంబంధించిన యాంటీ స్నేక్ వీనం మందులు అందుబాటులో ఉంచాం. పాము కాటేస్తే దాని లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు. ఏటా పాముకాటు మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. వానాకాలం జాగ్రత్తగా ఉండడం మంచిది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– ధన్‌రాజ్, జిల్లా వైద్యాధికారి

### జిల్లాలో ఇటీవలి ఘటనల్లో కొన్ని..

- ఇటీవల భైంసా నుంచి నిర్మల్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సులోంచి శబ్దాలు రావడంతో దానిని నిలిపిన డ్రైవర్, ప్రయాణికులు పరిశీలించగా నాగుపాము కనిపించింది. అది బుసలు కొడుతుండగా ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. బస్సును నిలిపి అక్కడే పామును కర్రతో చంపడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.
- గత గత నెల 11వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లో ఓ ఇంటి ఆవరణలో తాటిజెర్రి పాము కనిపించింది. దీంతో ఆ ఇంటివారు ఆందోళనకు గురై పాములు పట్టే సామాజిక కార్యకర్త ఫిరోజ్‌ఖాన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫిరోజ్‌ఖాన్ చాకచక్యంగా 10 అడుగుల తాటిజెర్రి పామును పట్టాడు. దానిని సంచిలో బంధించి సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు.
- ఇటీవల జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయం సమీపంలోగల పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిపి ఉంచిన బైక్‌లో పాము చొరబడింది. పెట్రోల్ ట్యాంక్ కింద ఇంజిన్లో దాక్కున్న ఆ పాము కొంతసేపు జనాన్ని హడలెత్తించింది. అక్కడే ఉన్న కొంత మంది యువకులు ఎంత ప్రయత్నించినా చిక్కకుండా దాదాపు గంటపాటు ముప్పుతిప్పలు పెట్టింది. వెంటనే పాములు పట్టే వ్యక్తిని పిలువగా అతడు దానిని బంధించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు.
- కొద్ది నెలల క్రితం కుభీర్ మండలం హంపోలి కే గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న ఓ బాలికను పాము కాటేసింది. ఆస్పత్రికి తరలించేలోపే పరిస్థితి విషమించి చనిపోయింది.
- గత జూలైలో కుభీర్ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం ఆవరణలో నిద్రిస్తున్న ఇద్దరు విద్యార్థినుల మధ్యలో నుంచి పాము వెళ్లడంతో వారు భయాందోళనకు గురయ్యారు.



# స్మార్ట్.. హాజరు

- ఫేషియల్ యాప్‌తో విద్యార్థుల అటెండెన్స్
- నేటి నుంచి పాఠశాలల్లో అమలు
- స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ ద్వారా ప్రక్రియ
- అవకతవకలకు ఇక నో ఛాన్స్
- త్వరలో ఉపాధ్యాయులకు కూడా..

ఆదిలాబాద్‌టౌన్/నిర్మల్‌రూరల్: సర్కారు బడుల్లో ఇక నుంచి విద్యార్థులకు ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్ఏ)ను అమలు చేయనున్నారు. స్కూళ్లలో బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్ కొనసాగుతుండగా, కరోనా తర్వాత ఈ ప్రక్రియ అమలు కావడం లేదు. ఈ క్రమంలో ఆయా పాఠశాలల్లో పథకాల అమలులో కచ్చితత్వం, అవకతవకలకు చెక్ పెట్టేందుకు గాను ఈ ఫేషియల్ యాప్‌ను రూపొందించారు. సోమవారం నుంచి జిల్లాలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. విద్యార్థి ముఖంలోని కనురెప్పలు, పెదాలు, ముక్కు తదితర అవయవాలను స్కాన్ చేస్తారు. బయోమెట్రిక్ హాజరు సమయం ఎక్కువ తీసుకుంటుండగా, ఈ యాప్ ద్వారా సత్వరం పూర్తవుతుంది. ఉపాధ్యాయుల వద్ద ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్స్, ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల ముఖాలను స్కాన్‌చేస్తే హాజరు నమోదవుతుంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు క్షణాల్లో ఈ వివరాలన్నీ చేరుతాయి. ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు.. హాజరు శాతం తదితర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి.

**నేటి నుంచి అమలు..**

పాఠశాల విద్యాశాఖ ఇదివరకు పైలెట్ ప్రాజెక్ట్‌గా రెండు జిల్లాల్లో ఈ యాప్‌తో విద్యార్థుల హాజరుకు శ్రీకారం చుట్టింది. అక్కడ సత్ఫలితాలివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి అమలుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే విద్యాశాఖాధికారులు సంబంధిత పాఠశాలల హెచ్ఎంలకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఈ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. నెట్‌వర్క్ లేని పాఠశాలల్లో ఆఫ్‌లైన్‌లో హాజరు తీసుకునే వెసులుబాటు కల్పించారు.

**యాప్ పనితీరు ఇలా..**

గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్' పేరిట ఉన్న ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఉపయోగించి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. విద్యార్థుల రిజిస్ట్రేషన్, హాజరు, డిటేల్ రిపోర్టు అనే ఆప్షన్లు ఉంటాయి. ఓ తరగతి గదిలో ఉన్న విద్యార్థుల వివరాలన్నీ యాప్‌లో నమోదవుతాయి. ఒక్కో విద్యార్థి పేరు క్లిక్ చేస్తే కెమెరా ఓపెన్ అవుతుంది. విద్యార్థి ముఖం రౌండ్ సర్కిల్‌లో ఉండేలా చూడడంతో పాటు ముఖం చుట్టూ ఎరుపు రంగు నుంచి ఆకుపచ్చ రంగు వస్తే హాజరు నమోదవుతుంది.

**అవకతవకలకు చెక్..**

పాఠశాలల్లో ఇదివరకు బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తుండగా, కరోనా తర్వాత ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఉపాధ్యాయులకు మాత్రమే బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ కొంత మంది టీచర్లు ఉపయోగించడం లేదు. మరమ్మతుల పేరిట ఈ యంత్రాలను మూలన పడేశారు. ఈ క్రమంలో విద్యార్థుల హాజరు కచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు ఫేస్ యాప్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. దీనిద్వారా ప్రతిరోజూ ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారనే విషయం తెలుస్తుంది. అలాగే మధ్యాహ్నం ఎంత మందికి భోజనం పెట్టారనే వివరాలు తెలిసిపోనున్నాయి. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోయినప్పటికీ కొంత మంది ఉపాధ్యాయులు హాజరు పట్టికలో హాజరు వేస్తున్నారు. ఇలా బిల్లులు అదనంగా కాజేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అయితే ఈ యాప్ ద్వారా ఇలాంటి అవకతవకలకు చెక్ పడనుంది. బోగస్ సంఖ్యను ఇట్టే గుర్తించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు లేనప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులు పోస్టులను కాపాడేందుకు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, స్కాలర్‌షిప్ వంటివి ఎంత మందికి అందించారనే విషయం కూడా ఇట్టే తెలిసిపోనుంది. అలాగే ఉపాధ్యాయులకూ త్వరలో ఈ యాప్ ద్వారా హాజరు నమోదు చేపట్టనున్నారు. తద్వారా దుమ్మా పంతుళ్లకు చెక్ పడనుంది.

### పారదర్శక హాజరు నమోదుకే..



ఫేషియల్ రికగ్నేషన్ యాప్‌తో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు పారదర్శకంగా నమోదవుతుంది. ప్రభుత్వం రెండ్రోజుల క్రితమే యాప్ నిర్వహణపై విధివిధానాలు ప్రకటించింది. హెచ్ఎంలందరికీ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలిచ్చాం. సోమవారం జూమ్ మీటింగ్ ద్వారా విధివిధానాలు తెలియజేస్తాం. రెండు, మూడ్రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేస్తాం. యాప్ హాజరుతో పాటు ఫిజికల్ అటెండెన్స్ కూడా తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

**ఉమ్మడి జిల్లా వివరాలు..**

| జిల్లా | ప్రభుత్వ పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య | ఉపాధ్యాయులు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 702 | 64,721 | 2,480 |
| మంచిర్యాల | 739 | 40,394 | 2,382 |
| నిర్మల్ | 735 | 59,000 | 2,416 |
| కుమురంభీం | 684 | 42,015 | 1,883 |

# 'రాంజీగోండు పోరు చిరస్మరణీయం'



నివాళులర్పిస్తున్న శివకుమార్, కార్యకర్తలు

నిర్మల్: దేశానికి 1947లో స్వాతంత్య్రం వచ్చినా తెలంగాణ ప్రాంతంలో మాత్రం నిజాం నిరంకుశ పాలనలో 13నెలలు మగ్గాల్సి వచ్చిందని, రాంజీగోండు, వెయ్యిమంది వీరులు చేసిన పోరాటం చిరస్మరణీయమని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ పేర్కొన్నారు. నైజాం విముక్త అమృతోత్సవాల్లో భాగంగా ఆదివారం హిందూవాహిని ఆధ్వర్యంలో భైంసా, నిర్మల్ శాఖల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాజీచౌక్ నుంచి జిల్లాకేంద్రం శివారులోని వెయ్యి ఉరుల మర్రి అమరుల స్తూపం వరకు చేపట్టారు. స్తూపం వద్ద నివాళులర్పించి అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విమోచనం పొందిన సెప్టెంబర్ 17న జాతీయజెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. వెయ్యిమంది అమరవీరుల స్మారకార్థం ఓ మర్రి మొక్క నాటారు. నాయకులు సరుకొండ శ్రీనివాస్, హరీశ్, మురళి, అనిల్, విజయ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**అమరుల త్యాగాలతోనే విముక్తి**

భైంసాటౌన్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని హిందూవాహిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. నైజాం విముక్త అమృతోత్సవాల్లో భాగంగా హిందూవాహిని మహిష (భైంసా)శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భైంసా నుంచి నిర్మల్‌లోని వెయ్యి ఉరుల మర్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సుభద్రవాటిక శ్రీసరస్వతీ శిశుమందిర్ నుంచి ర్యాలీ చేపట్టగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావు పటేల్ హాజరై ప్రారంభించారు. ముందుగా బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హిందూ వాహిని భైంసా పట్టణాధ్యక్షుడు ఆకుల రంజిత్, కార్యదర్శి చింతపండు మహేశ్, రాము, రవి, తాడేవార్ సాయినాథ్, దిలీప్ తదితరులున్నారు.

# గొర్రెల పంపిణీలో 'గోల్‌మాల్'

- అమ్మినవారే తిరిగి కొనుగోలు చేస్తున్న వైనం
- రూ.1.50 లక్షలకు అమ్మి.. రూ.90వేలకు కొనుగోలు
- లబ్ధిదారుల నిస్సహాయతను సొమ్ము చేసుకుంటున్న అధికారులు, దళారులు
- నాయకులు, అధికారుల అండదండలతో రీసైక్లింగ్
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు



జైనథ్ మండల కేంద్రంలో గొర్రెలతో లబ్ధిదారుడు, మండల పశువైద్యాధికారి వినోద్ దేశ్‌పాండే



లక్ష్మీపూర్ గ్రామంలో గొర్రెలతో లబ్ధిదారుడు

జైనథ్: గొల్ల, కుర్మలు, యాదవుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం జిల్లాలో క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితాలు అందించడంలో విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్క యూనిట్ ధర రూ.1.75లక్షలు ధర నిర్ణయించిన ప్రభుత్వం తన వాట కింద రూ.1,31,250 చెల్లించగా, లబ్ధిదారుడు రూ.43,750 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 20 గొర్రెలు, ఒక పొటేలు కొనుగోలుకు రూ.1.50 లక్షలు పోగా, మిగిలిన రూ. 25వేలతో గొర్రెల తరలింపు మందులు కొనుగోలు, ఇన్సురెన్స్ కోసం నిధులు కేటాయించడం జరిగింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రభుత్వం రెండో విడత పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 3597 మంది లబ్ధిదారులు డీడీలు కట్టారు. ఒక్కొక్క లబ్ధిదారుడు రూ.43,750 చొప్పున మొత్తం రూ.15.73 కోట్ల డీడీలు చెల్లించారు. దాదాపు సంవత్సర కాలంగా ఎదురుచూడగా ఈ ఏడాది జూలైలో యూనిట్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది.

**ఇవీ విధివిధానాలు...**

మొదటి విడత గొర్రెల పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో ప్రభుత్వం పంపిణీ విధివిధానాలను మరింత కఠినతరం చేసింది. గొర్రెల ఎంపికలో మండల పశువైద్యాధికారుల పాత్రను తగ్గించి జిల్లా , రాష్ట్ర స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దీనికోసం జిల్లా పశువైద్యాధికారి పర్యవేక్షణలో జిల్లా అధికారి, రాష్ట్ర స్థాయి అధికారితో కూడిన టీంను సిద్ధం చేశారు. లబ్ధిదారులు అధికారులతో కలిసి స్వయంగా గొర్రెల విక్రయించే వారి వద్దకు వెళ్లి కొనుగోలు చేసేలా, కొనుగోలు సమయంలో ప్రత్యేకమైన ట్యాబ్‌ల్లో ఆన్‌లైన్‌లో తమ ఇష్టపూర్వకంగా గొర్రెలను ఎంపిక చేసుకున్నట్లు వాయిస్ మెసెజ్ అప్‌లోడ్ చేసేలా నిబంధనలు చేర్చారు.

**447 యూనిట్ల పంపిణీ...**

ఈ ఏడాది జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో జిల్లా వ్యాప్తంగా రూ.7.80 కోట్లతో మొత్తం 447 యూనిట్లు (9387 గొర్లు) పంపిణీ చేశారు. మొత్తం 3597 మంది డీడీ కట్టగా, ఇప్పటి వరకు కేవలం 447 మందికే గొర్లు పంపిణీ చేశారు. ఇంకా 3150మందికి గొర్లు రావాల్సి ఉంది. వీరంత సంవత్సర కాలంగా ఒక్కొక్కరు రూ. 43,750 చొప్పున డీడీలు చెల్లించారు. ఎన్నికల కోడ్ వస్తుందని సర్వత్రా చర్చలు నడుస్తుండటంతో తాము కట్టిన డబ్బులు అయిన తిరిగి వస్తే చాలు అన్న పంథాలో లబ్ధిదారులు ఉన్నారు. దీంతో కొంత మంది అధికారులు, నాయకులు వీరి నిస్సహాయతను సొమ్ము చేసుకుంటున్నారు.

**నచ్చితే తీస్కో... లేదంటే మూస్కో..**

గొర్రెల పంపిణీలో అక్రమాలను నివారించడానికి ప్రభుత్వం కఠినమైన విధివిధానాలను రూపొందించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆగడం లేదు. పక్క రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కోదాడ మండలం నుంచి మాత్రమే గొర్రెలు కొనుగోలు చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. కోదాడ మండలంలోని నాలుగు గ్రామాల్లో గొర్రెల లభ్యత ఉండగా లబ్ధిదారులను అక్కడికే పంపించి గొర్రెలను తీసుకునేలా బలవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ అప్పటికే అనారోగ్యంతో ఉన్నవి, చెవికి ట్యాగ్ గాయాలతో ఉన్న (పలుమార్లు ఏమార్చి ఇన్స్యూరెన్స్ చేయబడినవి) గొర్లను కట్టబెడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

**కట్టింది రూ.43వేలు.. ఇచ్చేది రూ.90వేలే...**

లబ్ధిదారులు గొర్రెలను ఎంపిక చేసుకున్న తరువాత అధికారులు జీపీఎస్ ట్యాగ్ ఉన్న ఐచర్ వాహనాల్లో, ఒక్కొక్క వాహనంలో ఆరు యూనిట్ల చొప్పున గొర్రెలను లబ్ధిదారుల గ్రామాలకు తరలిస్తున్నారు. అక్కడ సర్పంచ్, గొల్లకుర్మ కమిటీ అధ్యక్షుడు, లబ్ధిదారుడు, స్థానిక పశువైద్యాధికారి సమక్షంలో ఐచర్ ఫొటోలు, గొర్రెల ఫొటోలు తీసీ ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. అనంతరం రెండు, మూడు రోజుల్లో గొర్రెలు అమ్మిన వ్యక్తి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఒక్కొక్క యూనిట్‌కు రూ.1.50లక్షలు జమ చేయడం జరుగుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అసలు కథ ఇక్కడే ప్రారంభం అవుతుంది. ముందుగానే కుదుర్చుకున్న డీల్ ప్రకారం తన ఖాతాల్లో డబ్బులు పడగానే సదరు గొర్రెలు అమ్మిన వ్యక్తి ఒక లారీతో ఆయా గ్రామాలకు వచ్చి లబ్ధిదారులకు యూనిట్‌కు రూ.90వేలు చెల్లించి తాను ఇచ్చిన గొర్రెలను మరల లారీలో ఎక్కించుకొని వెళ్లిపోతాడు. లబ్ధిదారులే అమ్ముకుంటున్నారని వారిని బద్నాం చేసే పనులు అధికారులు చేస్తున్నప్పటికీ అధికారులు, నాయకుల అండదండలతోనే ఇదంతా జరుగుతుందని లబ్ధిదారుల వాదన.

**మా దృష్టికి రాలేదు..**

జిల్లాలో గొర్రెల పంపిణీలో ఎలాంటి అక్రమాలు మా దృష్టికి రాలేదు. నిబంధనల ప్రకారం, లబ్ధిదారులు స్వయంగా వెళ్లి గొర్రెలు తెచ్చుకుంటున్నారు. గొర్రెల రవాణా కోసం వినియోగించే వాహనాలకు సైతం జీపీఎస్ ట్రాకింగ్ అమర్చడం జరిగింది. లబ్ధిదారుల గ్రామాలకు గొర్రెలు చేరిన తరువాత కూడా ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుంది. ఎక్కడైన అక్రమాలు జరిగినట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

–కిషన్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

## క్లుప్తంగా

### పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన గజ్జ చిన్న లస్మన్న(53) మతిస్థిమితం లేని వ్యక్తి శనివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపాడు. ఎస్సై వివరాల ప్రకారం... ఆలూరు గ్రామానికి చెందిన మృతుడు చిన్న లస్మన్న నెలరోజులుగా మతిస్థిమితం కోల్పోయి విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయనను కుటుంబీకులు పలు ఆస్పత్రిలో చూపించినా ఫలితం కనిపించలేదు. దీంతో ఇంటివద్దే ఉంచారు. అయితే శనివారం ఉదయం 9గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన చిన్నలస్మన్న రాత్రికి ఇంటికి చేరాక స్పృహతప్పి పడిపోయాడు. ఏమైందని గమనించిన ఆయన కుటుంబీకులు ఆయన పురుగుల మందు తాగినట్లు గుర్తించి వెంటనే నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు ఆయన భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

### గొర్రెల మందపై చిరుత దాడి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన దస్గరి దేవన్న గొర్రెల మందపై శనివారం చిరుత దాడి చేసిన ఘటనలో గొర్రెకు గాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ బీట్ అధికారి అనుపమ వివరాల మేరకు.. మండలంలోని కుస్లీ అటవీ ప్రాంతానికి శనివారం దస్గరి దేవన్న గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. గొర్రెల మందపై చిరుత దాడి చేయగా ఒక గొర్రె మెడకు గాయాలయ్యాయి. వెంటనే కాపరి అప్రమత్తమవడంతో చిరుత పారిపోయింది. గాయపడిన గొర్రెకు పశువైద్య సిబ్బంది చికిత్స చేసినట్లు తెలిపారు. పశువుల, మేకల, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా వెళ్లవద్దని, గుంపుగా వెళ్లాలని సూచిస్తున్నారు.

### పంటలపై అడవిపందుల దాడి

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కే) గ్రామంలోని మొక్కజొన్న రైతులు అడవిపందుల బెడదతో నానా ఇక్కట్లు పడుతున్నారు. గ్రామానికి చెందిన దూస నారాయణ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను అడవి పందులు శనివారం రాత్రి ధ్వంసం చేశాయి.

### మహాసభలను విజయవంతం చేయండి

ఎదులాపురం: తమిళనాడు రాష్ట్రం నామక్కల్ పట్టణంలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతీయ మహాసభల్లో 29 రాష్ట్రాల నుండి 1100 మంది ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. జిల్లా నుంచి మహాసభలకు ఐదుగురు ఎంపిక అయ్యారని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు ఆత్రం కిష్టన్న, నాయకులు రవి పాల్గొన్నారు.

### ఆశ వర్కర్ల ఫోన్లు హ్యాక్!?

- ఓటీపీలు అడుగుతున్న హ్యాకర్లు
- పోలీస్ కేసు నమోదు

జైనథ్: మండలంలోని జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేసే ముగ్గురు ఆశ కార్యకర్తల ఫోన్ నంబర్లు హ్యాక్ అయినట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. ఇటీవల కొంత మంది గర్భిణులు, ఇతర మహిళలకు ఆశా కార్యకర్తల ఫోన్ నుంచి వాట్సాప్ ఆడియో, వీడియో కాల్స్ వెళ్లాయని, అసభ్యకరమైన మెసెజ్‌లు వెళ్లడంతో పలువురు మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే కొంత మంది హ్యాకర్లు జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, మరికొంత మంది పీహెచ్‌సీ నుంచి మాట్లాడుతున్నామని చెప్పడంతో ఎవరూ హ్యాక్ చేసి ఉంటారనే అనుమానం వ్యక్తం అవుతోంది. న్యూట్రిషన్ కిట్ల పేరిట మోసం చేసేందుకు చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే హ్యాకర్లు ఓటీపీ అడగడంతో అసలు విషయం బయటకు పొక్కింది. వీరంత ఎవరూ? ఎందుకు చేస్తున్నారు.? అసలు నిజంగా ఫోన్‌లు హ్యాక్ అయ్యాయా.? అయితే ఆశా వర్కర్ల ఫోన్లు హ్యాక్ చేసే అవసరం ఏముంది అనేవి ఇంకా అంతుతేలని ప్రశ్నలు. లోన్ యాప్ బాధితుల్లో ఇలాంటి సంఘటనలు ఇటీవల కాలంలో బయటకు వచ్చాయి. ఎవరైన లోన్ యాప్ బాధితుల నుంచి ఈ నంబర్లు స్వీకరించారా? లేదా దీని వెనక ఇంకా ఏదైన ఉందా? అనేది ఇంకా తేలాల్సి ఉంది. దీనిపై మెడికల్ ఆఫీసర్ నైనతా జైనథ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపింది.

### యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. టుటౌన్ సీఐ అశోక్ వివరాల ప్రకారం.. జైనథ్ మండలానికి చెందిన యోగేశ్ (26) మద్యం మత్తులో బస్టాండ్ వద్ద పడిపోయాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రిమ్స్ నుంచి బయటకు వెళ్లి మద్యం తాగి అదే మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇచ్చోడ: వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకే చోట చదువుకున్నారు.. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. ఇచ్చోడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జీవన్‌రెడ్డి, మోహన్, ఖాజామియా, ప్రకాష్, సుదర్శన్, శంకర్, వర్మ, శౌకత్, ఎం.నారాయణరెడ్డిలను శాలువతో ఘనంగా సన్మానించారు. 120మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమ తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు.

## '1/70 చట్టాన్ని సవరించాలని చూస్తే ఊరుకోం'



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాలను సవరించాలని చూసే రాజకీయ పార్టీలను ఏజెన్సీ ప్రాంతాల నుంచి తరమికొట్టాలని తెలంగాణ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్స వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కమిటీలో పని చేసిన సభ్యులను త్వరలో రాష్ట్ర కమిటీలో తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలోని కమిటీ సభ్యులు ఆదివాసీల హక్కులను రక్షించడం కోసం ఉద్యమించాలని కోరారు. గ్రామాల్లో ప్రచారం కోసం వచ్చే పార్టీల నేతలను జీవో ఎంఎస్ నంబర్ 3పై నిలదీయడంతో పాటు ఆదివాసీల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు ప్రవేశపెడతారో వాటిపై నిలదీయాలన్నారు. సమావేశంలో ఏటీఏ రాష్ట్ర నాయకులు కుర్సేంగే శంగు, నైతం బాలు, నాయకులు సురేష్, జంగ్‌షా, సీతారాం, అరుణ్, మోహన్, పెందోర్ రాందాస్ పాల్గొన్నారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు, పోలీసులు

సారంగపూర్: మండలంలోని యాకర్‌పెల్లి గ్రామానికి చెందిన కోశెల అనిల్(20) స్థానిక చెక్‌డ్యామ్ వద్ద చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆయన మృతదేహం ఆదివారం మండలంలోని గొడిసెర గ్రామంలోని స్వర్ణనదిలో లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం... ఈ నెల 6వ తేదీన ఉదయం 10గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన అనిల్ తిరిగి రాలేదు. అయితే యాకర్‌పెల్లిలోని స్వర్ణ నదిపైగల చెక్‌డ్యామ్ వద్ద ఆయన బట్టలు, చెప్పులు లభ్యమయ్యాయి. చెక్‌డ్యాంలో పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు గాలించారు. అయినా ఆచూకీ లభించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గొడిసెర వాగులో ఆదివారం ఆయన మృతదేహం లభ్యమైంది. చెక్‌డ్యామ్‌లో చేపల వేటకు వెళ్లిన క్రమంలో నీటిలో పడిపోయి మృతిచెంది ఉండొచ్చని, రెండుసార్లు స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో కొట్టుకుపోయి గొడిసెర వాగులో మృతదేహం తేలి ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో డాక్టర్ వేణుగోపాల కృష్ణ వాగువద్దే శవపరీక్షలు నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

## అంతర్రాష్ట్ర రహదారిపై కుంగిన వంతెన

- నిలిచిపోయిన రాకపోకలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



కుంగిపోయిన అంతర్రాష్ట్ర రహదారి

తలమడుగు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ మహారాష్ట్ర అంతర్రాష్ట్ర రహదారిపై గల వంతెన పూర్తిగా కుంగిపోయి తెగిపోవడంతో రెండు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్ర మహోర్, మాడ్వి, కిన్వాట్ ఇతర ప్రాంతాలకు తలమడుగు మండలం లక్ష్మంపూర్ గ్రామం చెక్‌పోస్టు మీదుగా మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికుల వాహనాలు నిలిచిపోయాయి. శనివారం కురిసిన వర్షానికి ఆదివారం వంతెన రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. ఈ విషయం ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి ఎస్సై ధనశ్రీ చేరుకుని ప్రయాణికులను అప్రమత్తం చేశారు. అధికారులు స్పందించి త్వరగా అంతర్రాష్ట్ర రహదారి వంతెన మరమ్మతులు వెంటనే చేపట్టి పూర్తిచేయాలని కోరుతున్నారు.

### స్తంభాన్ని మోసుకెళ్లి.. కరెంట్ సరఫరా



స్తంభాన్ని మోసుకెళ్తున్న గ్రామస్తులు

తాంసి: విద్యుత్ స్తంభాన్ని తీసుకెళ్లేందుకు వేరే దారిలేక విద్యుత్ సిబ్బంది స్థానిక గ్రామస్తులతో కలిసి స్తంభాన్ని అరకిలో మీటర్ కర్రలు, తాళ్ల సాయంతో తీసుకెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు పంటచేల్లోకు త్రీఫేజ్ సరఫరా చేసే విద్యుత్ స్తంభం విరిగింది. దీంతో ఆదివారం విద్యుత్‌శాఖ సిబ్బంది మరో స్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చారు. రోడ్డు అరకిలో మీటర్ దూరంలో పంటచేను వరకు వాహనంలో స్తంభాన్ని తీసుకెళ్లే అవకాశం లేదు. దీంతో గ్రామ సర్పంచ్ కరీం పిలుపు మేరకు గ్రామస్తులు, విద్యుత్ శాఖ సిబ్బంది అరకిలో మీటర్ వరకు విద్యుత్ స్తంభాన్ని కర్రలు, తాళ్ల సాయంతో కట్టి పంటచేల్లోకి సాహసోపేతంగా తీసుకెళ్లారు. స్తంభాన్ని నెలకొల్పి గొల్లఘాట్, తాంసి(కె) గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షంలో సైతం విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరాను గ్రామస్తులు సైతం ఏఈ శ్రావణ్‌తో విద్యుత్‌శాఖ సిబ్బందిని అభినందించారు.

### బాసరలో ఎంపీ 'వద్దిరాజు' పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భైంసా: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించారు. తన మనువరాలు సహశ్రీతో అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

### భూమి పంపిణీ చేయాలి

ఎదులాపురం: భూమిలేని నిరుపేదలకు మూడెకరాల భూమిని పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.పద్మ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా సంఘం జిల్లా కార్యదర్శి లంకా రాఘవులు జెండా ఆవిష్కరణ చేసి అమరులకు నివాళి అర్పించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలు పన్నుతుందని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కోతలు విధించడం, పథకాన్ని నీరుగార్చాలని చూడటమే ఇందుకు నిదర్శనం అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా కార్యదర్శి లంకా రాఘవులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు బీజేపీ నైతిక బాధ్యత

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

కైలాస్‌నగర్: ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన నైతిక బాధ్యత బీజేపీపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. ప్రస్తుత సమావేశాల్లోనే ఈ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. దీక్షల్లో కూర్చున్న వారికి ఆయన పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. నోటితో మాటలు చెప్పడం, కాగితాల మీద తీర్మానం చేయడం ఆపేసి ఆచరణలో తమ నిజాయితీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి అదిగో, ఇదిగో అంటూ మాదిగ ప్రజలను మోసం చేస్తుందే తప్ప బీజేపీ ద్వారా ఒరిగిందేమి లేదని మండిపడ్డారు. వర్గీకరణ బిల్లుకు అడ్డుపడుతుందేవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే బీజేపీకి మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, కో–కన్వీనర్లు పలెపు గణేష్ , బర్కుంటి సుభాష్, ప్రేమేందర్, శీను, స్వామి, రాజేశ్వర్, శ్రీకాంత్, అనిల్, దశరథ్ పాల్గొన్నారు.

## బదిలీలు ఏజెన్సీ టూ ఏజెన్సీ చేపట్టాలి



ధర్నాలో ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయుల బదిలీల్లో గిరిజన ఉపాధ్యాయులకు ఏజెన్సీ టూ ఏజెన్సీకి కేటాయించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గిరిజన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని జెడ్పీ చైర్మన్ జనార్దన రాథోడ్ ఇంటి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు సుగుణ, చంద్రకాంత్, రవిలు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో జీవో నం.3కు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ఏజెన్సీ టూ ఏజెన్సీకే కేటాయించాలని తెలిపారు. ఆదివాసీ గిరిజన ప్రాంగణంలో 5వ షెడ్యూల్‌లో ప్రత్యేక హక్కులు, చట్టాలను కాపాడాలని కోరారు. 317 జీవోను ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే భారీ మొత్తంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ నాయకులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు రామారావు, గణేశ్ పాల్గొన్నారు.

## ప్రచారంపై ఉన్న శ్రద్ధ పనులపై లేదు

- టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత
- రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న గండ్రత్ సుజాత

కైలాస్‌నగర్: రాజకీయ లబ్ధి కోసం చేయని పనులను చేసినట్లుగా భారీ హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం చేసుకుంటున్న ఎమ్మెల్యే జోగు రామన్న పనుల పురోగతిని విస్మరించడం హాస్యస్పదంగా ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని డాల్డా కంపెనీ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులను ఆదివారం ఆమె పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అక్కడి ఇంజినీరింగ్ అధికారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు నత్తనడకన సాగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము అభివృద్ధికి ఏ మాత్రం వ్యతిరేకం కాదని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని స్వీకరిస్తామన్నారు. కానీ ఫ్లై ఓవర్ వంతెనకు సంబంధించి ఫిల్లర్ల నిర్మాణం కూడా కాకుండానే ప్రజలను మభ్యపెట్టేలా పూర్తి అయినట్లుగా దాని ఫొటోలతో హోర్డింగుల ద్వారా ప్రచారం చేయడం శోచనీయమన్నారు. పనులు ప్రారంభించి మూడు నెలలు దాటినా నేటికీ ఫిల్లర్ల నిర్మాణాలు జరుగక పోవడం ఎమ్మెల్యే చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తే నిర్వాసితులకు పరిహారం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లూరి సంజీవ్ రెడ్డి , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధులను విస్మరించిన ప్రభుత్వం

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను విస్మరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు వారోత్సవాలు అధికారికంగా నిర్వహిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం 4500 మంది పోరాట యోధుల త్యాగాన్ని, అమరత్వాన్ని మరిచిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే నైతికత బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. 17న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 50 వేల మందితో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 33 జిల్లాలకు చెంది సీపీఐ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకలదాసు, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు ముస్కె సమ్మయ్య, కొట్టే కిషన్‌రావు, చాడ మహేందర్‌రెడ్డి, కుంచాల శంకరయ్య, రామన్న పాల్గొన్నారు.